

కుందూ నది ఒడ్డున పేదల ఇళ్ల లేఅవుట్



పేదల స్థలంలో వైసీపీ కార్యాలయానికి పునాదుల నిర్మాణ పనులు



- అనుమతులు లేకుండానే అక్రమ కట్టడానికి తెర
- జగనన్న కాలనీలో వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణం
- లీజు పేరుతో రూ.10 కోట్ల విలువ చేసే స్థలం అప్పగింత
- అధికారం ఉంది కదా అని కౌన్సిల్‌లో ఏకపక్ష ఆమోదం
- అక్రమ కట్టడంపై కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

పేదల స్థలంలో పెత్తందారు ప్యాలెస్

నంద్యాల టౌన్, జూన్ 23 :

అడుగులు పడ్డాయి ఇలా..:

నంద్యాల జిల్లా కేంద్రంలో వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయానికి గత ఏడాది ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు పావులు కదిపారు. అధికారం ముసుగులో ఏకంగా రూ.60 కోట్ల విలువ చేసే నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఉద్యోగుల క్వార్టర్స్ ఆవరణంపై కన్నేశారు. అప్పటికే ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన 50 ఎకరాల భూమిని వైద్య కళాశాల నిర్మాణానికి కేటాయించడం వెనుక వైసీపీ నాయకులకు ఆర్ఏఆర్ఎస్ చుట్టూ ఉన్న భూములు, వ్యాపార, వాణిజ్య సముదాయాల ఆస్తుల విలువ రెండింతలు పెరిగింది. కలెక్టరేట్‌కు ఎదురుగా, వైసీపీ నాయకుల ఆస్తులకు కూతవేటు దూరంలో ఉన్న ఆర్ఏఆర్ఎస్ ఉద్యోగుల క్వార్టర్స్ ఆవరణం కలిపి మొత్తం దాదాపు మూడు ఎకరాలు ఉంది. ఇక్కడ సెంటు స్థలం రూ.20 లక్షలపైమాటే. దీంతో రూ.60 కోట్ల విలువ చేసే స్థలాన్ని లీజు పేరుతో చేజిక్కించుకునేందుకు ఆ పార్టీ నాయకులు అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి ఉద్యోగులను ఖాళీ చేయించాలని చూశారు. అత్యంత రహస్యంగా ఖరీదైన ఆర్ఏఆర్ఎస్ భూమిని చేజిక్కించుకోవాలన్న వైసీపీ కుయుక్తులను గత ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన క్వార్టర్స్ ఖాళీ చేయండి.. శీర్షికన ఇళ్లు ఖాళీ చేయాలని ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్న వైనాన్ని ఆంధ్రజ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. లోగుట్టు వ్యవహారం బట్టబయలు కావడంతో వైసీపీ నాయకులు ఆర్ఏఆర్ఎస్ స్థలాన్ని వైసీపీ కార్యాలయం కోసం చేజిక్కించుకునేందుకు చేసిన యత్నాలకు గండిపడింది.



పెత్తందారు ప్యాలెస్ నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు జీ హుజూర్ అన్నారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి స్వామి భక్తిని చాటుకున్నారు. విద్యుత్ అవసరం తప్పనిసరి కావడంతో అక్రమ మార్గంలో కనెక్షన్ ఇచ్చేశారు. సాధారణంగా కొత్త ఇంటి నిర్మాణానికి విద్యుత్ కనెక్షన్ పొందాలంటే సంబంధిత స్థలం డాక్యుమెంట్లు, నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ అప్రూవల్ ధృవపత్రం తప్పనిసరి. అయితే ఇక్కడ మాత్రం లీజు అగ్రిమెంట్‌పైనే విద్యుత్ కనెక్షన్‌ను ఇవ్వడం గమనార్హం. ప్లాన్‌లో నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి విద్యుత్ వాడకానికి సంబంధించి స్లాబ్ నిర్ణయించి అందుకు అనుగుణంగా కనెక్షన్ (1 ఫేస్, 2 ఫేస్, 3 ఫేస్) ను ఇవ్వాల్సి ఉండగా ఇవేమీ చూడకుండానే కనెక్షన్ ఇచ్చేశారు.

పక్కాగా పావులు కదిపారు ఇలా..

పేదలందరికీ ఇళ్ల పథకం కింద నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని అర్హత ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు నంద్యాల - కర్నూలు బైపాస్ రోడ్డు కుందూ నది పక్కన ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. కుందూకు వరదలు వస్తే ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ అధికారులు అదే స్థలాన్ని ఎంపిక చేశారు. కుందూకు - స్థలానికి మధ్య దూరం ఉందని, ఎలాంటి ప్రమాదం లేదని సంబంధిత అధికారులు నివేదించడంతో కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్ నడిబొడ్డున పెత్తందారు ప్యాలెస్ నిర్మాణం కోసం అప్పట్లో విధుల్లో ఉన్న పలు శాఖల అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగి ఎక్కడికక్కడ ప్యాలెస్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూలసాగరం సర్వే నంబరు 504/2లోని ఎకరా స్థలాన్ని వైసీపీ కార్యాలయం నిర్మాణం కోసం లీజు పద్ధతిపై పరాయికరణ (అలినేషన్) చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలపాల్సి ఉందని మండల తహసీల్దార్ 2023 మే 16వ తేదీన తమ లేఖ ఆర్‌సీఏ 84/2022 ద్వారా కోరారు. అయితే ఈ స్థలం ఆర్ఎస్ఆర్ రికార్డుల్లో జీడీగా వర్గీకరించి ఈడిగ బాలన్నగా నమోదు ఉంది. అయితే ఈ స్థలాన్ని కుందూ నది వెడల్పు కోసం నీటి పారుదల శాఖ తీసుకుంది. ఈ భూమిని నీటి పారుదల శాఖ వినియోగించుకోకపోగా తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించింది. రెవెన్యూ పరిధిలోని భూమిని వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు - పేదలందరికీ ఇళ్ల కింద పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం కోసం కేటాయించింది. కుందూ వెడల్పు, లోతు కోసం తమ దగ్గర నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ సేకరణ చేశారని, ఇతర అవసరాలకు ఆ భూమిని వినియోగించుకోవడానికి వీలులేదని, వినియోగించుకోలేని పక్షంలో తమ భూమి తమకు తిరిగి అప్పగించాలని రైతులు ఆందోళన చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో లీజు పద్ధతిలో స్థలాన్ని కేటాయించేందుకు కౌన్సిల్ సమావేశం అజెండాలో అంశాన్ని పొందుపరిచిన విషయాన్ని అప్పట్లోనే గత ఏడాది మే 30న జగనన్న లేఅవుట్‌లో వైసీపీ కార్యాలయం, ఎకరాలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు శీర్షికన ఆంధ్రజ్యోతి సంచలన కథనాన్ని ప్రచురించింది.

పట్టని అధికార యంత్రాంగం

పేదలకు పంచిన ఇళ్ల స్థలాల లేఅవుట్ నడిబొడ్డున పెత్తందారు ప్యాలెస్ నిర్మాణం అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణానికి వైసీపీ నాయకులు తెరలేపారు. నామమాత్రపు లీజు మొత్తంతో చేజిక్కించుకున్న ఖరీదైన స్థలంలో రూ.కోట్ల వ్యయంతో ఎకరా విస్తీర్ణంలో ప్యాలెస్ నిర్మాణానికి అధికారులు అడుగడుగునా చేయూతనందిస్తూ వచ్చారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సాధారణంగా మున్సిపాలిటీ పరిధిలో ఏదైనా భవన నిర్మాణం చేపట్టాలంటే పట్టణ ప్రణాళికా విభాగానికి దరఖాస్తు చేయాలి. స్థలం విస్తీర్ణం, నిర్మాణానికి సంబంధించిన ప్లాన్, ఎన్ని అంతస్థులు, స్లాబ్ ఏరియా, తదితర పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ నిబంధనల మేరకు ప్లాన్ పరిశీలించి అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని ధ్రువీకరించుకున్న తరువాతే నిర్మాణానికి ప్రణాళికా విభాగం అనుమతులు మంజూరు చేసింది. ఇందులో పురపాలక ప్రణాళికా విభాగానికి భవన నిర్మాణాల విషయంలో పరిమితులు ఉన్నాయి. ఈ పరిమితులను దాటితే దరఖాస్తును కర్నూలులో ఉన్న కుడాకు పంపాల్సి ఉంటుంది. భవన నిర్మాణ విస్తీర్ణం ఎక్కువగా ఉంటే కుడా ద్వారా అనుమతులు పొందాల్సి ఉంటుంది. వైసీపీ నంద్యాల జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం ప్లాన్ అప్రూవల్ కోసం అసలు దరఖాస్తే చేయకపోవడం వెనుక వైసీపీ ప్రభుత్వ అధికార గర్వానికి తార్కాణంగా పేర్కొనవచ్చు. అనుమతులు లేకుండా పెత్తందారు ప్యాలెస్ నిర్మాణానికి నెలల తరబడి పనులు చేసి ప్రస్తుతం పునాదుల ప్రక్రియ పూర్తి చేశారు. నెలల తరబడి పనులు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, కుడా అధికారులు సైతం కన్నెత్తి చూడకపోవడం వెనుక వైసీపీకి ఆయా శాఖల అధికార యంత్రాంగం మొత్తం ఊడిగం చేసిందన్న విషయం స్పష్టమవుతోంది. ప్యాలెస్ పునాదులు పెకిలించి వేసి అదే స్థలాన్ని అర్హులైన పేదలకు పంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పేదలందరికీ ఇళ్ళు పథకంలో కేటాయించిన స్థలంలో ప్యాలెస్ నిర్మాణం పునాదులు

అనుమతులు లేవు

కుందూ నది ఒడ్డున పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా వేసిన లేఅవుట్‌లో వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి సంబంధించి నంద్యాల పట్టణ ప్రణాళికా విభాగం నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

- నరసింహమూర్తి, పట్టణ ప్రణాళికా అధికారి, నంద్యాల

పేదలకు పంచాల్సిన లేఅవుట్‌లో..

ఆంధ్రజ్యోతి కథనంతో లోగుట్టు వ్యవహారం వెలుగులోకి రావడంతో దాదాపు మూడు నెలలపాటు మౌనంగా ఉంటూనే తెరవెనుక పేదలకు పంచాల్సిన ఎకరా స్థలాన్ని కాజేసేందుకు పావులు కదిపారు. గత ఏడాది మే నెలాఖరులో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పక్షంగా ఉన్న వైసీపీ కౌన్సిలర్లందరూ తమ పార్టీ జిల్లా కార్యాలయం కోసం ఎలాంటి చర్చ కూడా లేకుండానే ఏకపక్షంగా ఆమోదం తెలిపి రూ.10 కోట్ల విలువ చేసే స్థలాన్ని నామమాత్రపు మొత్తంతో లీజు పొందేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించడంతోపాటు అభ్యంతర పత్రాన్ని ఇచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.



లేఅవుట్‌లో నిలిచిన పేదల ఇళ్ళ నిర్మాణం


డయేరియా నివారణకు చర్యలు చేపట్టండి

కలెక్టర్, అధికారులను ఆదేశించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



నంద్యాల (కల్చరల్), జూన్ 23: జిల్లాలో డయేరియా (అతిసార) కేసుల వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కలెక్టర్‌తో పాటు అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుతో కలిసి మంత్రి వైద్య ఆరోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అతిసార కేసులు వ్యాప్తి అరికట్టేందుకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ స్ట్రాటజీ-మానిటరింగ్ మెకానిజం ద్వారా సూక్ష్మ ప్రణాళికలు రూపొందించి నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చేనెల 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాగునీటి వనరుల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మంచినీటి ట్యాంకులను వారానికోసారి శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు9 తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ చాబోలు గ్రామంలో సచివాలయ సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వలన 8 అతిసార కేసులు నమోదయ్యాయని మంత్రికి వివరించారు. జిల్లాలో 732 ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులు, 264 జిఎల్ఎస్ఆర్ ట్యాంకులు, 778 పిడబ్ల్యూఎస్‌లు, 1158 సిస్టర్న్, 5483 చేతిపంపుల ద్వారా 489 గ్రామపంచాయతీలకు సురక్షిత మంచినీరు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. డయేరియా నియంత్రణపై డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించినట్లు మంత్రికి వివరించారు. గ్రామంలో పారిశుధ్యం, సురక్షిత త్రాగునీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోతులపాడు, బన్నూరు పంచాయతీ సెక్రటరీలు మంజుల, శామ్యూల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు సంబంధిత ఈఓఆర్డీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

జనసంద్రమైన కోసిగి తిమ్మప్ప కొండ



కోసిగి తిమ్మప్ప కొండపై భక్తజన సందోహం

కోసిగి, జూన్ 23: ఏరువాక పౌర్ణమి మరుసటి రోజు కోసిగిలోని తిమ్మప్పకొండపై వెలసిన తిమ్మప్ప స్వామి (ఆంజనేయ స్వామి)ని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం కోసిగిలోని తిమ్మప్ప కొండపైకి చీమలదండుగా భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ముందుగా భక్తులు తిమ్మప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపై ఉన్న గాలిమరలు, గాలిపడ దగ్గర నిల్చుని కోసిగి చుట్టూ ఉన్న అందాలని తిలకించారు. కోసిగితో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పిల్లలు వేలాదిగా తరలిరావడంతో తిమ్మప్పకొండ పరిసర ప్రాంతమంతా భక్తజనసందడి మారింది.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో నాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని

శ్రీశైలం, జూన్ 23: శ్రీశైలభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని దర్శించుకున్నారు. దర్శనార్థం ప్రధానాలయం రాజగోపురం వద్దకు చేరుకున్న జస్టిస్ ఎం.జి.ప్రియదర్శినికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె ఆలయంలోని రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని మల్లికార్జున స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి



నంద్యాల క్రైం, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమ నిర్వహణ సోమవారం నిర్వహించనున్నట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలనుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సెల్ సిస్టం ద్వారా చేపటనున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఆఫీసులు, డీఎస్పీల కార్యాలయల్లో సైతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వానికి నివేదిస్తాం: బొజ్జా



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

కర్నూలు(కల్చరల్), జూన్ 23: రాయలసీమ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై నూతన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సంఘాలతో కూడిన ఒక సమగ్ర నివేదిక అందిస్తామని రాయలసీమ సాగునీటి సాధనా సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని బిర్లా గేటు సమీపంలోని డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆసుపత్రి సమావేశ హాలులో నాలుగు జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల వేదిక నాయకుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ఈ ఏడాది జూలై మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, ఇతర అధికారులను కలిసి, సమస్యలకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని నిర్ణయించారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 854 అడుగులు ఉండేలా కృష్ణా నది యాజమాన్య బోర్డు రూపొందించిన రూల్‌కర్వ్‌ను అమలు పరచాలని, విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టైల్ పాండ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, రాయలసీమ సాగునీటి హక్కులను కాలరాస్తూ గత ఏడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాజ్యాంగ విరుద్ధ చట్టాన్ని రద్దు చేయాలని, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీని కరువు పీడిత రాయలసీమకు వర్తించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని, చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని కోరారు. రాయలసీమలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యాలయాలను కర్నూలులోనే యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తున్నామని సమావేశంలో నాయకులు ప్రకటించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, డేవిడ్, శ్రీనివాసులు, రామ్‌కుమార్, వెంకటేశ్, రాహుల్, రత్నం ఏసేపు, సుంకన్న, సుబ్బరాయుడు, శేషగిరి, శివశంకర్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల గుబులు



కర్నూలు(న్యూసిటీ), జూన్ 23: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీల గుబులు లేపుతోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బదిలీలు అనివార్యమైనట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తమ స్థానలను పదిలం చేసుకునేందుకు కొందరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వైసీపీ నాయకులకు అంటకాగిన అధికారులు మంత్రులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు పీఆర్ఐ ఈఈగా వచ్చేందుకు కొందరు ఈఈలు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఇక్కడ పని చేసిన వారే..

గతంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో డీఈలుగా విధులు నిర్వహించిన ఐదుగురు ఈఈలకు పదోన్నతి లభించి రాష్ట్రంలోని పలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో సుబ్బరాజు(నెల్లూరు) కేవి సుధాకర్ గౌడు(నెల్లూరు), జి.మల్లికార్జున(కాకినాడ), వైసీ సుబ్బరాయుడు(పల్నాడు) ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు ఈఈలు ఉమ్మడి జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా ప్రస్తావన వస్తే ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురిలో ముగ్గురు, ప్రస్తుతం ఇక్కడ విధులు ఇర్వహిస్తున్న ముగ్గురిలో ఇద్దరు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. జీవో విడుదలైతే బదిలీల ప్రయత్నాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా ఈ

నెలాఖరులో పదవీ విరమణలు..

పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో ఈ నెలాఖరులో ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందనున్నారు. కర్నూలు సూపరింటెండెంట్ ఇంజనీర్ కే సుబ్రమణ్యం, ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వెంకటప్రసాద్‌తోపాటు ఇద్దరు డీఈలు, ఏఈలు పదవీ విరమణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఎస్ఈ పోస్టును పదోన్నతుల్లో భాగంగా భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీరో సర్వీసును అమలు చేస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాలుగు ఈఈ పోస్టుల్లోకి వచ్చేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. ఆదోని ఈఈ పోస్టు క్లియర్‌గా ఉన్న, నంద్యాల పీఆర్, పీఐయూ ఈఈ పోస్టులకు ఇప్పటికే పలువురు దక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. కర్నూలు ఎస్ఈ పోస్టుకు కూడా పలువురు ఇతర జిల్లాల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో గతంలో పీఐయూ ఈఈగా ఇక్కడ విధులు నిర్వహించిన విజయకుమారి ప్రస్తుతం విజయవాడలో పని చేస్తున్నారు. ఆమె ఇక్కడికి రానున్నట్లు సమాచారం.

● పంచాయతీరాజ్‌లో పైరవీలు

నెలాఖరులకు పలువురు ఇంజనీర్లకు స్థానం చలనం తప్పదనే ప్రచారం ఉంది. కర్నూలు డివిజన్ పీఆర్ఐ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎస్ఈ టు పీఏ శ్రీనివాసులుకు వచ్చే అవకాశం ఉంది.

సీఈ పోస్టుకు ప్రయత్నాలు

కర్నూలు సూపరింటెండెంట్ ఇంజనీరు కే సుబ్రమణ్యం ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. అయితే ఈయనకు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి వచ్చే అవకాశం ఉంది. సీఈల పదోన్నతుల జాబితాలో ఈయనే పేరు మొట్టమొదటగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, అడవుల శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను కలిసేందుకు విజయవాడ వెళ్లినట్లు తెలిసింది. అయితే సుబ్రమణ్యం కంటే ముందు వరుసలో ఉండే ఎస్ఈ కొండయ్య ప్రకాశం జిల్లాలో పని చేస్తూ గత నెల 31న పదవీ విరమణ పొందారు. దీంతో సుబ్రమణ్యంకు ఎలాంటి పోటీ లేదు.

భర్తను హతమార్చిన భార్య

- దంపతుల మధ్య ఘర్షణ
- కత్తెరతో పొడిచిన భార్య
- నంద్యాల పట్టణంలో దారుణం



మృతి చెందిన వెంకటేష్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 23: నంద్యాల సుద్దులపేటలో కట్టుకున్న భర్తను ఓ మహిళ కత్తెరతో పొడిచి హత్య చేసింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుద్దుల పేటకు చెందిన వెంకటేష్ (42) ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. 20 ఏళ్ల క్రితం మమతతో వెంకటేష్‌కు వివాహం జరిగింది. భర్త వెంకటేష్, మద్యానికి బానిస కావడంతో ఇద్దరి మధ్య నిత్యం ఘర్షణలు చోటు చేసుకునేవి. ఇదిలా ఉండగా మమత వరుసకు బావతో సన్నిహితంగా ఉండటంతోనే వెంకటేష్ మద్యానికి బానిసయ్యాడని అతడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇద్దరి మధ్య పెద్దల సమక్షంలో ఎన్నో సార్లు పంచాయతీలు చేసినా తిరిగి గొడవపడేవారని తెలిపారు. ఈ క్రమంలో శనివారం వెంకటేష్ మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో దంపతులు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. భర్తపై భార్య విచక్షణా రహితంగా దాడికి పాల్పడటంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వెంకటేష్ ఆదివారం ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం మళ్లీ భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన మమత ఇంట్లో ఉన్న కత్తెరతో భర్త వెంకటేష్ ఛాతీపై పొడిచింది. స్థానికులు వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ రాజారెడ్డి ఆసుపత్రికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. నిందితురాలు మమతను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.



ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజారెడ్డి

ఆకాశంలో అల్లం ధర

ఆందోళనలో వినియోగదారులు



మార్కెట్లో అమ్ముడవుతున్న అల్లం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: మార్కెట్లో ఇప్పటికే వివిధ రకాల కూరగాయల ధరలు కొండెక్కి కూర్చోగా అల్లం ధర ఆకాశానికి చేరింది. బహిరంగ మార్కెట్లో అల్లం ధర రూ.250 నుంచి రూ.280 వరకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మాంసం ప్రియులకు చికెన్, మటన్ ధరలు చుక్కలు చూపిస్తుండగా, అల్లం ధర మరింత భారంగా మారింది. ఆదివారం, మంగళవారం వచ్చిందంటే చాలు మాంసం లేనిదే అత్యధిక మందికి ముద్ద దిగని పరిస్థితి. అయితే మసాలా వంటకాల్లో అల్లం వాడకం తప్పనిసరి. దీంతో గతంలో రూ.5, 10 వెచ్చిస్తే కొంత ముక్క దొరికే అల్లం, ప్రస్తుతం రూ.20, 40 వెచ్చించినా సరిపోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా అల్లం దిగుబడి తగ్గి పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముగిసిన న్యాయాధికారుల సదస్సు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూన్ 23: త్వరలో రానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై రెండు రోజుల న్యాయాధికారుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయాధికారులు ఈ చట్టాల పట్ల అవగాహన కలిగి కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని ఆయన కోరారు. ఈ సదస్సులో జిల్లాలోని అందరు న్యాయాధికారులతో పాటు అదనపు జిల్లా న్యాయాధికారులు వాసు, మురళీకృష్ణ, పాండురంగారెడ్డి, ప్రతిభాదేవి, భూపాల్ రెడ్డి, ఏవో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: మండల కేంద్రంలో ఆదివారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. సాయిబాబా ఆలయం పక్కనే నివసిస్తున్న కుమ్మరి సుబ్రమణ్యం భార్య కుమ్మరి గంగా శ్రావణి(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. సుబ్రమణ్యం వృత్తిరీత్యా కూరగాయల కొనుగోళ్ల కోసం ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇద్దరు చిన్న పిల్లలు ఏడుస్తూ కనిపించారని, లోపలికి వెళ్లి చూడగా తన భార్య ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించిందని మృతురాలి భర్త సుబ్రమణ్యం వాపోయాడు. విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రావణితో గత 12 సంవత్సరాల క్రితం సుబ్రమణ్యంకు వివాహం జరిగింది. శ్రావణి మృతితో ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మారారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో వెలుగు చూస్తాయని సీఐ తెలిపారు.

ట్రాక్టర్ క్రింద పడి యువకుడి మృతి

క్రిష్ణగిరి, జూన్ 23: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు బోకుల్ సింక్(20) ఆదివారం మృతి చెందాడు. శనివారం సాయంత్రం కట్టల కోసం బోకుల్ సింక్, దునై అనే యువకులు ట్రాక్టర్‌లో వెళ్లారు. కంబాలపాడు-పెనుమాడ గ్రామాల మధ్యలో ఉన్న బావి సమీపంలో కట్టెలు ఏరుకుంటుండగా రివర్స్‌లో ట్రాక్టర్ బోకుల్ సింక్‌పైకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలపాలవడంతో బోకుల్ సింక్ మృతి చెందాడు. మండలానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ దగ్గర ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకులు ఐదు నెలలుగా విద్యుత్ పనులు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజా వలి తెలిపారు.

ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

హాస్టల్ ప్రారంభోత్సవంలో మంత్రి టీజీ భరత్



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), జూన్ 23: ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవి వైశ్య హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ దంపతులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే రోశయ్య తర్వాత టీజీ వెంకటేశ్ గుర్తొస్తారని అన్నారు. విద్యార్థులకు వైశ్య హాస్టల్‌ను ప్రారంభించం సంతోషంగా ఉందని అన్నారు. తమ సేవలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తాను మొదటి నుంచి ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తూనే ఉన్నానని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులను బానిసలుగా చూసేవారని, దివంగత నాయకుడు రోశయ్యతో కలిసి ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులను బానిసలుగా చేసే నాయకులకు గుణపాఠం చెబుతూ వైశ్యులకు తగిన గౌరవం కల్పించినట్లు గుర్తు చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు, చదువులేని వారికి ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆస్తులను పలువురు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి ఆస్తులను రక్షించి ఆర్యవైశ్య కమ్యూనిటీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తూనే ఉన్నామని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆర్యవైశ్యులందరూ ఒక కుటుంబంలా ఉండాలని టీజీ వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవకి వెంకటేశ్వర్లు, సిద్దా నాగేశ్వరరావు, పెనుగొండ సుబ్బరాయుడు, ఇల్లూరు లక్ష్మయ్య, టీజీ శివరాజ్, అమరవాది లక్ష్మీనారాయణ, కోటా సత్యనారాయణ, రజని, శబరి వరప్రసాద్, రాయపూడి గణేశ్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఫెవికాల్ వీరులు





కల్లూరు, జూన్ 23: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖలో ఫెవికాల్ వీరులు ఎక్కువైపోయారు. ఏళ్ల తరబడి సీటుకు అతుక్కుపోయి విద్యుత్ శాఖలో చక్రం తిప్పుతున్నారు. వివిధ క్యాడర్లలో 25 మందికి పైగా అధికారులు ఉన్నట్లు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో విద్యుత్‌శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వంలో అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరించి జిల్లాలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల సేవలో తరించిన ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఇచ్చిన ప్రతిపాదనలపై కనీసం స్పందించకపోవడంతో వారు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ జిల్లాలో కొనసాగేందుకు ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సదరు విద్యుత్ శాఖ ఉన్నతాధికారి వ్యవహార శైలిపై పెదవి విరిచినట్లు సమాచారం.

● పదోన్నతి వస్తేనే ఇక్కడి నుంచి వెళతా.: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 164 శాసనసభ స్థానాలు న్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ బదిలీ అవుతారని అధికారులు, ఉద్యోగుల్లో తీవ్రచర్చ జరుగుతోంది. దీంతో కోపోద్రిక్తుడైన ఉన్నతాధికారి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎవరూ ఎస్ఈ బదిలీపై మాట్లాడవద్దని ఇటీవల టెలీకాన్ఫరెన్స్‌లో సైతం ఉద్యోగులపై విరుచుకుపడినట్లు సమాచారం. ఆ మాటకు వస్తే ఇక్కడి నుండి పదోన్నతి వస్తేనే వెళతానని..లేదంటే రాజీనామాకు సిద్ధమని పలువురు అధికారులు, ఉద్యోగుల వద్ద వ్యక్తపరిచినట్లు విశ్వసనీయ సమాచారం.

మాజీ మంత్రి అండతో ఎస్ఈగా నియామక ఉత్తర్వులు

కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా 2022 ఆగస్టు 30న వెంకటసుబ్బయ్య బాధ్యతలు స్వీకరించారు. గంటల వ్యవధిలో డోన్ డీఈగా పని చేస్తున్న ఎం.ఉమాపతిని తిరుపతి ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ విధంగా కర్నూలు ట్రాన్స్‌కో ఎస్ఈలుగా మధ్యాహ్నం ఒకరు.. రాత్రి 7 గంటలకు ఇంకొకరు ఒకే రోజు ఇద్దరు బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వైసీపీ మంత్రి అండదండలతో, రాజకీయ పలుకుబడితో పట్టు బట్టి మరి ఆయన కర్నూలు ఉమ్మడి జిల్లా ఎస్ఈగా విధుల్లో చేరినట్లు ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరిగింది. మంత్రికి అత్యంత సన్నిహితుడిగా మారిన సదరు అధికారి విద్యుత్ శాఖలో కొనసాగుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఔషధ శాఖ ఏడీ సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు(హాస్పిటల్), జూన్ 23: జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఏడీ ఏటీవీ రమాదేవి సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. గత నెల ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో కలెక్టర్ సిఫారసు మేరకు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఏడీని సస్పెండ్ చేశారు. కలెక్టర్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆదేశించడంతో ఏడీ సస్పెన్షన్‌ను డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఎత్తివేశారు. ఈ మేరకు జిల్లా ఔషధ శాఖ ఏడీ రమాదేవి సోమవారం విధుల్లో చేరనున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు (రూరల్), జూన్ 23: గోరంట్ల హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించనట్లు తెలిపారు. దాడిలో ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామని అన్నారు. డ్రైవర్లు రామక్రిష్ణాపురానికి చెంది న కేశన్న, షేక్షావలి ఆలంకొండకు చెందిన సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిరుద్యోగులపై వివక్ష

- అప్కాస్ పేరిట కోత
- ఇకనైనా న్యాయం జరిగేనా?

ఆలూరు, జూన్ 23: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు, వర్కర్లకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల్లో కోత విధించింది. దీంతో సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రభుత్వ తీరుపై చిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు...

● అప్కాస్ పేరుతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కోత...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (అప్కాస్)ను ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తూ వచ్చారు... అయితే అప్కాస్‌లో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా తీసుకున్న వైసీపీ ప్రభుత్వం అమ్మఒడితోపాటు ఇంట్లో ఎవరైనా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే, వారందరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు నిలిపివేయడంతో తీవ్ర ఆందోళన చెందారు.. చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు మరోవైపు పార్ట్ టైం వర్కర్స్‌ది కూడా ఇదే పరిస్థితి.. ఔట్ సోర్సింగ్, ఉద్యోగుల ఇళ్లలో భార్య, భర్త, తల్లి లేదా కుమారుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉంటే వారికి ప్రభుత్వం ఇచ్చే వృద్ధ, వికలాంగుల పెన్షన్లను కూడా తొలగించారు. ఆన్‌లైన్‌లో వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపడంతో అవాక్కయ్యారు.. విద్యాశాఖలో అధికంగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు, వార్డెన్లు, స్వీపర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లు, కుక్స్‌ల పిల్లలకు సైతం అమ్మఒడి పథకానికి అనర్హులయ్యారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.. రూ.10వేలు వేతనం తీసుకుంటున్న వారికీ ఈ పథకాలు నిలిపివేశారు.. అదే ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు విధానంలో పని చేస్తూ నెలకు రూ.30 వేల నుంచి 40వేల వరకు వేతనం అందుకుంటున్న జూనియర్ లెక్చరర్లు, నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రం సంక్షేమ పథకాలు అమలు అవడం విశేషం.

టీడీపీ ప్రభుత్వంపై ఆశలు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి.. అమ్మకు వందనం పథకం పేరిట ఇంట్లో ఎంతమంది చదువుతున్నారో వారందరికీ రూ.15వేల చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడంతో తమకు కూడా వర్తిస్తుందనే ఆశతో ఉన్నారు.. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి సంక్షేమ పథకాలు మాకు కూడా వర్తించేలా చూడాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు విష్ణు, సుధారాణి, సుమలత, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ కోరుతున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఈవో, సిబ్బంది

శ్రీశైలం, జూన్ 23: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకిలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్య కళాశాల బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషికవాహన, అదిగదిగో శ్రీశైలం, హరహర శంభో, నమోనమో నటరాజ, నమఃశివాయ గంగాధరాయ, హిమగిరి తనయ, శివతాండవం తదితర గీతాలకు వెంకట పూజిత, సర్వజ్ఞ, వరలక్ష్మి, భువన కృతి, జయలక్ష్మీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పాణ్యం, జూన్ 23: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం 2007వ సంవత్సరానికి చెందిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీ రమాదేవి, అధ్యాపకులు మల్లికార్జున, శేషయ్య, హెచ్‌వోడీ ఫరూక్, వీరేష్, రాజశేఖరరెడ్డి, హరిత, రియాజ్‌నాయక్, భాస్కర్, వెంకటేశ్వర్లు, మునవర్ పాల్గొన్నారు.

'టీడీపీ ప్రకటన హర్షణీయం'


ఫయాజ్, ఫిరోజ్‌ను సన్మానిస్తున్న ఇమాముల సంఘం సభ్యులు

నంద్యాల (కల్చరల్), జూన్ 23: టీడీపీ ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, రాష్ట్రంలో ఇమాములకు, మౌజనులకు వేతనం ఇస్తామని ప్రకటించడం హర్షణీయమని నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజద్‌బాషా సిద్దికి, సభ్యులు అన్నారు. ఆదివారం నంద్యాల సాయిబాబానగర్ కుబ్రా మసీదులో జిల్లా ఇమాముల సంఘం సమావేశం నిర్వహించారు. విదేశీ విద్యకు ఏపీజే అబ్దుల్ కలాం విదేశీ విద్యగా నామకరణం చేసిన టీడీపీ ప్రభుత్వానికి, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ సమావేశానికి వచ్చిన ముఖ్య అతిథులు మంత్రి కుమారులు ఎన్ఎండీ ఫయాజ్, ఎన్ఎండీ ఫిరోజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇమాములు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 23: నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా ఫిర్యాదు మేరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులపై కౌంటర్ కేసు నమోదైంది. శనివారం 29వ వార్డులోలని సచివాయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను పెట్టేందుకు వెళ్లిన టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, తిమ్మయ్యపై మాబున్నీసా, ఆమె కుటుంబ సభ్యులు టీడీపీ నాయకులపై చిందులేశారు. కులం పేరుతో దూషించారని టీడీపీ నాయకుడు తిమ్మయ్య, సుబ్బరాయుడు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ఆమె కుటుంబ సభ్యులు, సచివాలయ అడ్మిన్ రమేష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆదివారం మాబున్నీసా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనతో పాటు తన కుటుంబ సభ్యులపై టీడీపీ నాయకలు అమర్యాదగా మాట్లాడారని దౌర్జన్యంతో బెదిరించారని ఫిర్యాదు చేయడంతో టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, తిమ్మయ్య, రామకృష్ణ, బబ్లూ, శివశంకర్ యాదవ్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంధకారంలో ముంపు గ్రామాలు

- విద్యుత్, రోడ్డు సౌకర్యాలు లేక ప్రజల అవస్థలు
- టీడీపీ పాలనలో రోడ్డు పనులు ప్రారంభం
- వైసీపీ పాలనలో నిధుల్లేక నిలిచిన రహదారి నిర్మాణం


ఆగిపోయిన సంగమేశ్వరం-జానాలగూడెం రహదారి పనులు



జానాల గూడెంలో మూతపడిన గిరిజన ఆశ్రమ పాఠశాల

కొత్తపల్లి, జూన్ 23: శ్రీశైలం జలాశయంలో ముంపునకు గురైన నల్లమల్ల పల్లెలైన జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాలు అభివృద్ధికి నోచుకోక అంధకారంలో మగ్గుతున్నాయి. 40 ఏళ్లుగా మౌలిక సదుపాయాలు లేక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఎన్నో ప్రభుత్వాలు, పాలకులు మారినా వీరి జీవనశైలి మాత్రం మారడం లేదు. ఈ కోవలోనే కొత్తపల్లి మండలంలోని కృష్ణానది ఒడ్డున ఉన్న జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాలు విద్యుత్ సౌకర్యానికి కూడా నోచుకోలేక అంధాకారంలో మగ్గుతున్నాయి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఆశలు రేకెత్తిస్తున్నాయి. గతంలోనూ టీడీపీ ప్రభుత్వ హయాంలో సంగమేశ్వరం నుంచి జానాల గూడెం వరకు ఎస్టీ సబ్ ప్లాన్ కింద ప్రభుత్వం సుమారు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసి పీఐయూ అధికారుల పర్యవేక్షణలో ఈపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారికి పనులు అప్పగించి పనులను ప్రారంభించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో నామమాత్రంగా పనులు చేపట్టి కేవలం ఈ రహదారి వెంట కంకర మాత్రమే వేసి ఒక కిలోమీటరు మాత్రమే బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి చేతులు దులుపుకుని పనులు మధ్యలోనే నిలిపివేశారు. అలాగే గత 40 ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఈ గ్రామాలకు ఐటీడీఏ అధికారులు సోలార్ లైట్లు మాత్రమే వేశారు. అవి కూడా పని చేయడం లేదు. ఇదిలావుంటే పక్కనే కృష్ణానది ఉన్నా ఈ గ్రామాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. అంతేగాకుండా శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి బయల్పడిన ముంపు భూములను కూడా సాగు చేసుకునేందుకు ఈ గ్రామాల ప్రజలను వీల్లేకుండా పోయింది. అలాగే జానాలగూడెంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలకు కూడా ఉపాధ్యాయులు లేకపోవడంతో గత ఏడాదికాలంగా మూతపడింది. దీంతో గిరిజన విద్యార్థులు అడవిబాట పట్టారు. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ఈ నల్లమల పల్లెలపై ఈ టీడీపీ ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందని వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

40 ఏళ్లుగా పట్టించుకోలేదు



40 ఏళ్లుగా మా గ్రామాలను పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. గతంలో ఇద్దరు కలెక్టర్లు సైతం తమ గ్రామాలను సందర్శించినప్పటికీ మొదటి నుంచి గ్రామాలను సందర్శించి సమస్యలను కళ్లారా చూసి కూడా పట్టించుకోలేదు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలోనైనా మా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నాం.

- సుధాకర్, టీడీపీ నాయకుడు, జానాలగూడెం

వైసీపీ పాలనలో మధ్యలోనే ఆగిన రోడ్డు పనులు



ఓ పక్క నల్లమల అటవీ ప్రాంతం. మరో దిక్కు శ్రీశైలం రిజర్వాయర్. మధ్యలో మా గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎంతో మంది నాయకులు ఓట్ల కోసం వస్తున్నారు తప్ప మా గ్రామాల సమస్యలను పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో మా గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరైతే వైసీపీ ప్రభుత్వం మధ్యలో నిధులు కేటాయించకుండా పనులు నిలిపివేసింది. టీడీపీ ప్రభుత్వంపైనే తమ గ్రామాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

- అంగటి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు, బలపాలతిప్ప

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

- అతిసార బాధితులకు జయసూర్య, శివానందరెడ్డి పరామర్శ ● యువకుడి మృతికి నివాళి ● బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ

జూపాడుబంగ్లా, జూన్ 23: మండలంలోని పోతులపాడు మజారా గ్రామం చాబోలులో గత నాలుగు రోజుల నుంచి కలుషితనీరు తాగి 30 మందికిపైగా అస్వస్థతకు గురికావడమే కాకుండా, అతిసారతో నాగన్న అనే యువకుడు మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే జయసూర్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ నాయకులు గ్రామంలో పర్యటించారు. నాగన్న మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైద్యసిబ్బంది సకాలంలో వారికి వైద్యసేవలు అందించి ఉంటే ఇంతవరకు వచ్చేది కాదని ఎమ్మెల్యే అన్నారు. అతిసార రావడానికి కారకులైన పంచాయతీ కార్యదర్శి సామేలు, ఈవోఆర్డీ మధుమోహన్ చక్రవర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సస్పెండు చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటరమణకు తెలిపారు. సర్పంచ్ చెక్‌పవర్ రద్దుచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎటువంటి సౌకర్యాలు లేవని, ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. జూపాడుబంగ్లాలోని ఉన్న ప్రభుత్వం స్థలంలో ప్రతి కుటుంబానికి రెండుసెంట్లు స్థలం ఇచ్చేందుకు నివేదిక తయారు చేయమని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, మోహన్‌రెడ్డి, రవికాంత్, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, సుధాకర్, రవికుమార్‌యాదవ్, పెద్దన్న, రామోహ్మన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, బాలమద్దిలేటి, రాముడు, బాబు, మన్సూర్‌బాషా, ఉస్మాన్‌బాషా, శివరామిరెడ్డి, సోమశేఖర్‌గౌడు ఉన్నారు.

నందికొట్కూరు: జూపాడుబంగ్లా మండలం చాబోలు గ్రామానికి చెందిన లోకేష్, సరస్వతిల కూతురు లావణ్య(7), మరియమ్మ, సుజానమ్మ అతిసారా బారిన పడి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ జూపాడుబంగ్లా మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్, నందికొట్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, జమీల్, జనార్దన్, పోతులపాడు మాజీ సర్పంచ్ రవికుమార్, తదితరులు ఉన్నారు.


చాబోలులో యువకుడి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

టీడీపీ నాయకుడి కుటుంబానికి సానుభూతి

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలోని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకాంతరెడ్డి తల్లి ప్రమీలమ్మ (80) మృతిచెందారు. ఆదివారం కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి ప్రమీలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాయకులు సురేంద్రనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హరినాథరెడ్డి, నాగేశ్వరరావు ఆదిరెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, మధుకృష్ణ, లింగేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం


భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలం, జూన్ 23: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన టీఆర్ఎం శర్మ రూ. 2,00,016 విరాళంగా అందజేశారు. దాత ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు హిమ బిందుకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

'నా స్వామి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల (కల్చరల్), జూన్ 23: నంద్యాల రామక్రిష్ణా డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం రాత్రి సూరన సారస్వత సంఘం ఆధ్వర్యంలో "నాస్వామి" పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. డా.వైష్ణవి వెంకటరమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోడూరి శేషఫణి శర్మ రచించిన "నాస్వామి" పుస్తకాన్ని డా.గెలివి సహదేవుడు, డా.రామక్రిష్ణారెడ్డి, నివర్తి మోహన్‌కుమార్, పాణ్యం శ్రీనివాస్, విశ్రాంత శాస్త్రవేత్త డా.రవీంద్రనాథ్ ముఖ్య అతిదులుగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం లలిత కవి దివంగత తాటిమాను నారాయణరెడ్డి సాహితీ పురస్కారాన్ని తాటిమాను కుటుంబసభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో అన్నెం శ్రీనివాసరెడ్డి, శేషఫణి, డాక్టర్ వెంకటేశ్వర్లు,గుటూరి చంద్రశేఖర్, తాటిమాను మురళీధర్ రెడ్డి, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


నంద్యాలలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు


గడివేములలో నివాళి అర్పిస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు

నంద్యాల (కల్చరల్), జూన్ 23: నంద్యాలలో బీజేపీ జిల్లా కార్యాలయంలో పూర్వ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అభిరుచి మధు మాట్లాడుతూ జనసంఘ్ పార్టీ ఏర్పాటు చేసి అఖండ భారతం కోసం, దేశ సమగ్రత కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: బీజేపీ మూలపురుషుడు డా.శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ నాయకుడు చల్లా దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం నందికొట్కూరులోని చౌడేశ్వరి దేవాలయంలో డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకుడు చల్లా దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ నాయకుడు రామచంద్రుడు, కృష్ణ యాదవ్, సంజీవరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అశ్విని కుమార్, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, హరికృష్ణ, హనుమంతయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: దేశ ప్రజలందరు జాతీయవాద భావాలను అలవర్చుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబాన అన్నారు. ఈ మేరకు ఆదివారం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

గడివేముల: గడివేములలో ఆదివారం జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జనసేన నాయకుడు సాయికుమార్ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమాల్‌బాషా, రమణ, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు


స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాణ్యం, జూన్ 23: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సుబ్బరాయుని కొత్తూరు దేవస్థానంలో భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. భక్తులు స్వామికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అన్నసత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు వీరయ్య స్వామి, నారాయణస్వామి, సురేష్ శర్మ, కిట్టయ్య, రోహిత్ శర్మ పాల్గొన్నారు.

స్థలం విషయంలో ఘర్షణ.. ఇద్దరిపై కేసు

మహానంది, జూన్ 23: ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడి దాడికి ప్రయత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ ఆదివారం తెలిపారు. మహానంది గ్రామంలోని ఈశ్వర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న విజయ్ అనే వ్యక్తిపై సూరి అతని కుమారుడు శాంతకుమార్ ఇంటివద్ద స్థలం విషయంలో ఘర్షణకు దిగినట్లు తెలిపారు. విజయ్‌పై సూరి, శాంతకుమార్ దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సూరిని అదుపులోకి తీసుకోగా అతని కుమారుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

26న వేలం పాటలు

పాణ్యం, జూన్ 23: పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 26వ తేదీన మార్కెట్, బండ్లమెట్ట వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆనందరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వేలం పాటలో పాల్గొను పాటదారులు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం పాటలు ప్రారంభమవుతాయని చెప్పారు. వేలం కాలపరిమితి తొమ్మిది నెలలు ఉంటుందని తెలిపారు.

'బీజేపీ సహకారంతో రాష్ట్రాభివృద్ధి'

పాణ్యం, జూన్ 23: బీజేపీ సహకారంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు అన్నారు. పాణ్యంలోని జ్వాలా లిటిల్ ఏంజల్స్ పాఠశాలలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం పార్టీ మండల కోఆర్డినేటర్ కేపీ మద్దిలేటి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాణ్యం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా దోనపాటి రామమద్దిలేటిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మధు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలతో పేద ప్రజలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కొట్టే చెన్నయ్య, గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్, మంజుల వెంకటరమణ, రామకృష్ణ, రమణ యాదవ్, శ్రీనివాసులు, చంద్రవర్ణ యాదవ్, నటేష్‌కుమార్, నాగభూషణం, వెంకటరాముడు, నాగరాజు, గంగాధర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, దిలీప్‌శర్మ, ధనలక్ష్మి, సుబ్బమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గిరిజనులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, జూన్ 23: గిరిజనులకు నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గిరిజనుల అభివృద్ధికి పాటు పడాలని గిరిజన టీడీపీ నాయకులు నాగరాజు నయక్ ,లలిత్ నాయక్, ఉపేంద్ర నాయక్‌లు కోరారు. వారు మాట్లాడుతూ గిరిజనులకు ఎస్టీ కమిషన్‌లో అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు నాయక్, సురేష్ నాయక్, సిసింద్రి నాయక్ తదితరులుపాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

పాణ్యం, జూన్ 23: మండలంలోని గోనవరం వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలం ఆదివారం నిర్వహించారు. మహానంది మండలం గాజులపల్లె సర్వనరసింహస్వామి ఆలయ ఈవో నర్సయ్య, పాణ్యం ఈవో సువర్ణ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఆలయానికి చెందిన 26.44 ఎకరాల భూముల వేలంలో 22 మంది రైతులు పాల్గొన్నారు. ఈ వేలం ద్వారా రూ.1,57,000 ఆదాయం చేకూరినట్లు ఈవో తెలిపారు. గత వేలం పాటలో రూ.61,500 ఆదాయం రాగా ఈ ఏడాది అదనంగా రూ. 95,500 ఆదాయం వచ్చిందని చెప్పారు.

'నీటి సమస్య తీర్చాలి'

ఆత్మకూరు, జూన్ 23: ఆత్మకూరులోని ఏకలవ్యానగర్‌లో నెలకొన్న నీటిసమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర కోరారు. ఆదివారం ఏకలవ్యానగర్ కాలనీకి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. 9రోజులుగా ఏకలవ్యానగర్ కాలనీకి నీటిసరఫరా లేకపోవడంతో కాలనీవాసులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. బిందె రూ.5, డ్రమ్ము రూ.50చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

వెలగని వీధి దీపాలు


వీధి దీపాలు వెలగని దృశ్యం

వెలుగోడు, జూన్ 23: వెలుగోడు పట్టణంలోని తెలుగు గంగ కాలనీలో గత ఐదు రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాన్ని అంధకారంలో ఉన్నాయి. ఈ కాలనీలో తహసీల్దార్, ఎంపీడీవో, తెలుగుగంగ, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాలతో పాటు రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు అంధకారంలో ఉండటంతో పాటు కాలనీవాసులు చీకటిలో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బేతంచెర్లలో ఎమ్మెల్యే కోట్ల పర్యటన

డోన్, జూన్ 23: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సోమవారం బేతంచెర్ల పట్టణంలో పర్యటించనున్నట్లు ఆదివారం పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 7 గంటల నుంచి పట్టణంలోని ఆయా వార్డులలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అదే విదంగా మండలంలోని గోరుమానుకొండ, సీతారామాపురం గ్రామాల్లో పర్యటిస్తారనీ తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ పర్యటనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

గంగమ్మ ఆలయంలో ఇందిరమ్మ పూజలు



పూజల్లో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23 : మండలంలోని బెలుం గ్రామంలో గంగమ్మ ఆలయం ప్రతిష్ఠ నిర్వహించి, 41రోజులు ముగిసిన సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతిరెడ్డి రాఘవరెడ్డి, టపాల్ హుస్సేనయ్య, శివుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

సంజామల, జూన్ 23 : సంజామల మండలంలోని నొస్సం గ్రామంలో కొలువైన బుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలుగు మహిళా నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆలయానికి చేరుకున్న బీసీ ఇందిరమ్మను ఈవో రామచంద్రుడు, ధర్మకర్త శ్రీరాముడు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు గాదంశెట్టి రమణయ్య, వెంకటేశ్వర్లు గ్రామ టీడీపీ నాయకులు కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల కారణంగా బీసీ జనార్దన్ రెడ్డి హాజరు కాలేకపోయారన్నారు. ఆలయ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ బ్రహ్మోత్సవాలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. బీసీ ఇందిరమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ముస్లింలు టీడీపీకి అండగా నిలిచారు ..



ముస్లిం మైనార్టీ కార్యకర్తలతో లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23 : ముస్లింలు టీడీపీకి పెద్ద ఎత్తున అండగా నిలిచారని టీడీపీ బనగానపల్లె నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు వీఆర్ లక్ష్మీరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ హయాంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో దూదేకుల దస్తగిరి, రామకోటి, బొబ్బన్న, బాబు,కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడి మృతి

డోన్(రూరల్), జూన్ 23: డోన్ పట్టణం ఎస్‌కేపీ హైస్కూల్ చెందిన సీనియర్ రిటైర్డు ఉపాధ్యాయులు పెద్ద మౌలాలి (76) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల ఎస్టీయూ కార్యదర్శి ఇక్బాల్, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, మౌలాలీ సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డు టీచరు మౌలాలి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు అన్నారు.



పెద్ద మౌలాలి (ఫైల్)

● రిటైర్డు సీనియర్ ఉపాధ్యాయుడు పెద్ద మౌలాలి మృతి పట్ల డోన్ పెన్షనర్ల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. ఆయన మృతి పెన్షనర్లకు తీరని లోటు అని పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేఎన్ భానుసింగ్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పెన్షనర్ల సంఘం నాయకులు గాలయ్య, గోపాల్, సుబ్బరాయుడు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



మల్లిక, స్వర్ణలత, మస్తాన్‌బీ, నిర్మల

డోన్(రూరల్), జూన్ 23: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ, ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్యలు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, అధ్యక్షులుగా కె.మల్లిక, ప్రధాన కార్యదర్శులుగా స్వర్ణలత, వర్కింగ్ ప్రెసిడెంటుగా మస్తాన్‌బీ, కోశాధికారిగా నిర్మల, ఉపాధ్యక్షురాలుగా జయలక్ష్మి, మంగమ్మ, వసంత, సహాయ కార్యదర్శిగా విజయలక్ష్మి, సునీత, పుష్పలత, నీరజతో పాటు 23 మందితో కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు జులైఖ, చాందిని, ఏస్తేరు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 23: మండలంలోని చిన్నకంబలూరు, కొండమాయపల్లె, రుద్రవరం, యల్లావత్తుల గ్రామాల్లో పెద్దమ్మ మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు, చీరలు సమర్పించారు.

అధిక వర్షాలతో సాగుకు ఇబ్బందులు

బనగానపల్లె, జూన్ 23: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ముందస్తు వర్షాలు భారీగా కురవడంతో బనగానపల్లె నియోజవర్గంలో పంట భూములు బీళ్లుగా మారాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లో 40 వేల హెక్టార్లకు పైగా ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో బనగానపల్లె మండలంలో ఖరీఫ్‌లో 13 వేల హెక్టార్లలో రైతులు పంటలు సాగుచేస్తారు. అయితే ఈ సారి భారీగా వర్షాలు కురవడంతో భూములు బీళ్లుగా మారిపోయాయి. జూన్ మొదటి వారం నుంచే వర్షాలు బాగా కురవడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. మామూలుగా అయితే మినుము, పెసర, మొక్కజొన్న, ప్రత్తి, జొన్న, కంది, కొర్ర తదితర పంటలను సాగు చేస్తారు. కాని కొందరు కౌలు రైతులు మెట్ట పొలాలను సైతం ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. కాని కౌలుకు తీసుకున్న పంట పొలాలు బీళ్ల కావడంతో కౌలు ఖర్చుతో పాటు బీళ్లుగా మారిన పంటలను సాగు చేయడానికి వేలాది రూపాయాలు ఖర్చవుతోందని వాపోతున్నారు. అలాగే సన్న, చిన్నకారు రైతులు సైతం వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. అందుకే రైతులు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. దీని వల్ల వ్యవసాయానికి పెట్టే పెట్టుబడుల ఖర్చులు తగ్గుతాయని రైతులు పేర్కొంటున్నారు. బీళ్లుగా మారిన పంట పొలాలను పండించడానికి రైతులు పెట్టుబడులతోనే నలిగిపోతున్నాడు.



బీళ్లుగా మారిన పంట భూములు

ఆలయ భూములకు కౌలు వేలం

శిరివెళ్ల, జూన్ 23: మండలంలోని కోటపాడు గ్రామంలో వెలిసిన ఆలయాలకు చెందిన 83.85 ఎకరాల భూములకు ఆదివారం నిర్వహించిన బహిరంగ కౌలు వేలం పాటల ద్వారా రూ.26,80,500 ఆదాయం వచ్చినట్లు గ్రూపు దేవాలయాల ఈవో గంటా వేణునాథరెడ్డి తెలిపారు. గత ఏడాది ఈ భూములకు రూ.22.04 లక్షల ఆదాయం రాగా ప్రస్తుతం రూ.4,76,500 లక్షల ఆదాయం పెరిగి ందని తెలిపారు. కేశవ స్వామి ఆలయానికి చెందిన 45.58 ఎకరాల భూములకు గత ఏడాది రూ.12.10 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.15.16 లక్షలు, వీరభద్ర స్వామి ఆలయానికి చెందిన 38.27 ఎకరాల భూములకు గత ఏడాది రూ.9.94 లక్షలు ఆదాయం రాగా ప్రస్తుతం రూ.11,64,500 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఏడాది కాలపరిమితితో నిర్వహించిన ఈ వేలంపాటలో గ్రామానికి చెందిన రైతుల మధ్య పోటీ నెలకొనడంతో ఆలయాలకు భారీ ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయశాఖ బనగానపల్లె డివిజన్ తనిఖీ అధికారి హరిశ్చంద్రారెడ్డి ఈ వేలం పాటలకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అర్చకులు, దేవదాయశాఖ సహాయకుడు మేరువ శివనాగిరెడ్డి పాల్గొన్నారు.



కోటపాడులో వేలంపాటలు నిర్వహిస్తున్న అధికారులు

నేడు వేలం

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్లలో వెలసిన ఆలయాలకు చెందిన భూములకు సోమవారం బహిరంగ కౌలు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు గ్రూపు దేవాలయాల ఈవో టీవీ నరసయ్య ఆదివారం తెలిపారు. ఇందులో రామస్వామి ఆలయానికి చెందిన 21.16 ఎకరాల భూములకు, చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 25.8 ఎకరాల భూములకు, ఈశ్వరస్వామి ఆలయానికి చెందిన 22.24 ఎకరాల భూములకు కౌలువేలం నిర్వహిసున్నట్లు తెలిపారు. 2024-25కు గాను ఏడాది కాలపరిమితితో నిర్వహిస్తున్న ఈ కౌలు వేలంపాటలో పాల్గొనేందుకు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని ఈవో తెలిపారు.

నేటి నుంచి వేలం పాటలు

రుద్రవరం: రుద్రవరం మండలంలో దేవాలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో నరసయ్య శనివారం తెలిపారు. నేడు సోమవారం చిలకలూరులో ఈశ్వర చెన్నకేశవ, 25న పేరూరులోని ఈశ్వర, రామాంజనేయ, 27న యల్లావత్తుల లక్ష్మినరసింహస్వామి, నాగేశ్వరస్వామి దేవాలయ మాన్యం భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. కౌలు వేలంలో పాల్గొనే రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

మాట నిలుపుకున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూన్ 23: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముస్లింలకు ఇచ్చిన మాటను నిలుపుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఈద్గా ఖబరస్థాన్ బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఇటీవల బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గా ఖబరస్థాన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ముస్లింల విన్నవించుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కోట్ల హామీ ఇచ్చారు. ఆ మేరకు ఈద్గాలోని ఖబరస్థాన్‌లో బోరు వేయించడంతో రెండు ఇంచుల పైనే నీళ్ల రావడంతో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి సంతోషం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే కోట్లకు ముస్లింలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా బుగ్గ వేంకటేశ్వర స్వామి రథోత్సవం

సంజామల, జూన్ 23 : నొస్సం గ్రామంలో కొలువైన బుగ్గ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రథోత్సం నిర్వహించారు. గ్రామంలో ఉన్న తేరుపై స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య తేరును లాగారు. రథోత్సవంలో భాగంగా కోలాటం, చెక్కభజన వంటిసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవ అనంతరం స్వామివారిని సాయంత్రం ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఎస్‌ఐ రమేష్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహంచారు.



రథోత్సవానికి భారీగా తరలి వచ్చిన భక్తులు

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన :

బుగ్గ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24 నుంచి రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల రాతిదూలం పోటీలు క్షేత్రంలో జరగనున్నాయి. సీనియర్ విభాగంలో జరిగే ఈ పోటీలను రాష్ట్రం నలుమూలల నుంచి ఎద్దులు పాల్గొననున్నాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మొదటి బహుమతి రూ.80,000 అందజేయనున్నారు. ఎద్దుల పోటీలతో పాటు మోటార్‌సైకిల్ స్లో రేస్, గాడిద పందేలు క్షేత్రంలో నిర్వహించనున్నారు.

'హిందూ ధర్మాన్ని కాపాడాలి'

చాగలమర్రి, జూన్ 23: ప్రతి ఒక్కరు హిందూ ధర్మాన్ని కపాడాలని అభినవ శంకరానందస్వామి కోరారు. ఆదివారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందూవులు హిందూ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ధర్మప్రచారాన్ని గడపగడపకు తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా శబరి ఎంపిక పట్ల హర్షం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23 : నంద్యాల పార్లమెంట్ మొట్ట మొదటి మహిళా ఎంపీగా భారీ మెజార్టీతో విజయం సాధించిన డా.బైరెడ్డి శబరికి టీడీపీ పార్లమెంట్‌లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపిక చేయడం పట్ల కొలిమిగుండ్ల మండల టీడీపీ యువ నాయకులు గూడూరు శివరామిరెడ్డి ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదములు తెలిపారు.



గూడూరు శివరామిరెడ్డి

ముగిసిన జ్యోతుల ఉత్సవాలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: మండలంలోని కోటపాడు గ్రామంలో జ్యోతుల ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. జ్యోతులను ఎత్తుకొని తొగట వీరులు గ్రామ పుర వీధుల్లో భాజా భజంత్రీల నడుమ నృత్య ప్రదర్శన చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన వంకం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో రూ.1లక్ష విలువ చేసే వెండి కిరీటాన్ని చౌడేశ్వరీ అమ్మవారికి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, చౌడయ్య, సుబ్బరాయుడు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోవెలకుంట్ల, జూన్ 23 : కోవెలకుంట్లలోని సీతారాంనగర్‌లోని త్యాగరాజస్వామి దేవాలయంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో ట్రెజరర్ మందుల సీతారామయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అప్పపోగుల వెంకటసుబ్బయ్యలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తి ఓబులేస్, బీజేపీ నాయకులు లాయర్ వెంకటకుళాయి. లాయర్ తిరుపతయ్య, మేడా మల్లిఖార్జున, ఆకుమళ్ల బాల తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల, జూన్ 23(ఆంధ్రజ్యోతి): జనసంఘ్ పార్టీ అధినేత దివంగత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అఖండ భారత్ కోసం కృషి చేశారని బీజేపీ నాయకుడు మురళీధర్‌గౌడు అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముత్యాలపాడు ఎస్పీజీ పాఠశాలలో గురువులతో పూర్వ విద్యార్థులు

చాగలమర్రి, జూన్ 23: మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో చదివిన 2006-07 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 18 సంవత్సరాలు తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. గురువులను శాలువ, పూలమాలలతో సన్మానించారు. పాఠశాల హెచ్ఎం లలిని ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గురువులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



చింతలపేట గ్రామంలో టీడీపీ కార్యకర్త అక్బర్‌బాషాను పరామర్శించిన మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు

డోన్(రూరల్), జూన్ 23: డోన్ మండలం చింతలపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ అక్బర్‌బాషాను డోన్ మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు ఆదివారం సాయంత్రం పరామార్శించారు. ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు కాలుజారీ కింద పడి గాయాలపాలైన టీడీపీ కార్యకర్త అక్బర్‌బాషాను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ ధైర్యం చెప్పారు. ఆయన వెంట చింతలపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, లారీ ఓనర్ రామక్రిష్ణ, బాలన్న, మనోహర్, ధర్మవరం బాలు తదితరులు ఉన్నారు.

చెక్‌డ్యామ్‌కు జలకళ

చాగలమర్రి, జూన్ 23: మండలంలోని పెద్దబోదనం బుచ్చమ్మ కోనేరు వద్దగల చెక్‌డ్యామ్ జలకళ సంతరించుకుంది. ఇటీవల కుండపోత వర్షం కురవడంతో చెక్‌డ్యామ్‌లో వరద నీరు చేరింది. చెక్‌డ్యామ్‌లో పూర్తిస్థాయిలో నీరు ఉండటంతో చుట్టుపక్కల గల పొలాల్లోని బోర్లకు నీటి మట్టం కూడా పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూగ జీవాలు, రైతులు, కూలీలకు కూడా దాహం తీర్చుకునేందుకు వీలు పడింది.



కంపు కొడుతున్న ఆర్టీసీ బస్టాండ్



చెత్తా చెదారంతో నిండిన ఆర్టీసీ బస్టాండ్

బనగానపల్లె, జూన్ 23 : బనగానపల్లె ర్టీసీ బస్టాండ్ కంపు కొడుతోంది. ఆర్టీసీ బస్సులు లోపలికి వచ్చే ప్రవేశ ద్వారం వద్ద చెత్తా చెదారం కుప్పలు కుప్పలుగా వేస్తుండడంతో దుర్గంధంగా మారింది. బస్టాండ్‌లోకి ప్రయాణికులు ఈమార్గం గుండా రావాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. ప్రవేశ మార్గం వద్ద చెత్తా చెదారం వేస్తుండడంతో పందులు బస్టాండ్ ప్రాంతంలో స్వైర విహారం చేస్తున్నాయి. దీనికి తోడు ఈగలు, దోమలు బస్టాండ్‌లో పెరిగిపోయి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఆర్టీసీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా స్పందిచండం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం వేయకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలు పునాదులకే పరిమితం



గోర్లగుట్ట జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన పేదల ఇళ్ల నిర్మాణాలు

బేతంచెర్ల, జూన్ 23: ఇల్లు లేని నిరుపేదలకు వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేయించి, ఇంటి నిర్మాణం చేసి ఇస్తానన్న ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణాల పనులు పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బేతంచెర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో, పట్టణంలో 19 జగనన్న కాలనీల లేఅవుట్లు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో ప్రభుత్వం 2402 మంజూరు చేసింది. వాటిలో పిల్లర్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు 22 మంది, ఇంటి నిర్మాణాలకు పునాదులు వేయని వారు 476 మంది, గుంతలు తీసి వదిలివేసిన బేస్‌మట్టం 351 మంది లెంటల్ లెవెల్ 125 మంది, ఇంటి రూపు లెవెల్ 114 మంది లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని, 1314 మంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు చాలక అప్పులు చేసి ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకున్నామని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లపైనే వారపు సంత

● ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



అమ్మవారిశాల సమీపంలో రోడ్లపైనే సంత

బేతంచెర్ల, జూన్ 23: మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివారం జరిగే వారపు సంతకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. కోటపేట ప్రాంతంలో సంత మార్కెట్‌లోనే నిర్వహించేందుకు అన్ని వసతులు ఏర్పాటు చేసినప్పటికీ చిరు వ్యాపారులు రోడ్లపైనే అంగళ్ల వేసుకున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు చిన్న చిన్న అంగళ్ల ముందు ప్రజల రాకపోకలు జరగాలన్నా వాహనాలు వెళ్లాలన్నా ఆవుల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో రోడ్లపై ఆవులను యజమానులు వదిలినట్లయితే జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారుల మాట పెడచెవిన పెట్టి ఆవుల యజమానులు రోడ్లపైనే ఆవులను వదలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్లపై వారపు సంత నిర్వహించకుండా కోటపేటలో ఏర్పాటు చేసిన సంత మార్కెట్‌లో వారపు సంత జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు యజమానులు, ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

'నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి'



శిరివెళ్లలో సమావేశంలో సూచనలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

శిరివెళ్ల, జూన్ 23: మండలంలోని గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్ కుమార్ సూచించారు. శిరివెళ్లలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన ఆదివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలుషితమైన నీటిని తాగడం వల్ల ప్రజలు అతిసార బారిన పడే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వినిపించారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ నర్సిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గంగమ్మకు బోనాలు

చాగలమర్రి, జూన్ 23: చాగలమర్రిలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించేందుకు పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. మహిళలు సామూహికంగా ఒడి బియ్యం కార్యక్రమాన్ని చేశారు. గంగమ్మ తల్లి కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ దాతలు నాగరాజు, బలరాముడు, నాగలక్ష్మి, శ్రావణి, యతింద్ర తదితరులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో బోనాలతో ఊరేగింపు చేస్తున్న మహిళలు

● చాగలమర్రిలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మకు ఆదివారం ఘనంగా పూజలు చేశారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ పూజలు చేశారు. అలాగే గ్రామ దేవత చాగలమ్మ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.